

నకిలీ పోలీస్ గ్యాంగ్ అరెస్ట్

పౌల్ట్రీఫామ్ నిర్వాహకుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన నకిలీ పోలీసుల గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. - 8లో▸



ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

ఆర్యవైశ్యులకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.5° /23.2°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. కాస్త ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ 6:34	మంగళ 4:46

సూర్య ప్రతాపం

- ఎండ తీవ్రతతో ప్రజలు విలవిల
- పండ్ల రసాలకు డిమాండ్
- చెట్లకింద సేద తీరున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

మహబూబాబాద్: ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ నుంచి ఉపశమనం పొందడానికి పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, ఇతర శీతల పానీయాలు తాగుతున్నారు. ప్రయాణం చేసేవారు చెట్ల కింద కొంతసేపు సేదతీరిన తర్వాత గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

నిర్మానుష్యంగా..

ఇటీవల అకాల వర్షాలతో కొద్ది రోజులు వాతావరణం చలబడింది. అయితే గత పదిరోజుల నుంచి ఎండ తీవ్రత విపరీతంగా పెరిగింది. దీంతో మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోని రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనుల మీద బయటకు వెళ్లే వారు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పాదచారులు గొడుగులు, వాహనదారులు టోపీలు ధరిస్తున్నారు. కాగా ఇంట్లో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి ఏసీలు, కూలర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. చల్లటి తాగునీటి కోసం ఫ్రిజ్‌లు, మట్టి కుండలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వాటికి డిమాండ్ పెరిగింది.

వడదెబ్బతో జాగ్రత్త..

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఎండలో తిరిగితే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. ఎండ తీవ్రతతో దాహం ఎక్కువగా కావడం, కాళ్లు, చేతులతో పాటు కండరాల బలహీనత వల్ల కుప్పకూలే అవకాశం ఉంది. వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురికావడం, మృతి చెందే అవకాశాలు ఉన్నాయి.

జాగ్రత్తలు ఇలా..

నల్లగొడుగు అయితే హీట్‌ను లాగేస్తుంది. ఇంటి కప్పులు స్లాబ్‌లు చల్లగా ఉండే విధంగా చూసుకోవాలి. వెంటిలేషన్ సక్రమంగా ఉండాలి. ఉదయం 11.30గంటల లోపు బయట పనులు పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వెళ్లాలి. ఇంకా ఏమైనా పనులు ఉంటే సాయంత్రం నాలుగు తర్వాత బయటికి వెళ్లాలని వైద్యులు చెబుతున్నారు. పండ్ల రసాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. నీడ ఉన్న ప్రదేశాల్లో కొంతసేపు సేద తీరాలి. ప్రధానంగా పిల్లలను బయటికి పంపించొద్దు.



నిర్మానుష్యంగా మారిన మానుకోట పట్టణంలోని మూడుకొట్ల సెంటర్



చెరకు రసం తాగుతున్న ప్రజలు

జిల్లాలో ఇటీవల నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్టం	గరిష్టం
1	24.9	37.5
2	24.3	37.0
3	24.9	41.9
4	25.7	39.4
5	24.2	39.3
6	25.9	41.1
7	22.1	40.0
8	21.1	39.4
9	23.2	39.5

జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవిలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా నడుచుకుంటూ వెళ్లే వారు నల్లగొడుగును తమ వెంట తీసుకెళ్లాలి. బండ్లమీద ప్రయాణం చేసే సమయంలో చెట్లకింద, నీడ ఉండే ప్రదేశాల్లో ఆగాలి. పండ్ల రసాలు, శీతల పానీయాలు తీసుకోవాలి. ఉదయం 11.30లోపు మాత్రమే పనులు ముగించుకొని ఇళ్లకు వెళ్లాలి. సాయంత్రం నాలుగు గంటల తర్వాత బయటికి వెళ్లాలి. ఎండదెబ్బ లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి

- నెహ్రూ, ప్రముఖ డాక్టర్

మారిన మానుకోట పట్టణ రూపురేఖలు

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులతో మానుకోట పట్టణ రూపురేఖలు మారిపోయాయని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుతో పాటు పలువార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇటీవల జిల్లాలో పర్యటించి మానుకోట మున్సిపాలిటీకి రూ.50కోట్లు మంజూరు చేశారన్నారు. దీంతో ప్రతివార్డుకు రూ.50లక్షలు కేటాయించామని, పనులు చేపట్టేందుకు వార్డుల్లో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. మానుకోట మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

క్రీడామైదానం కబ్జా!



బోర్డు తొలగించిన కబ్జాదారులు



భూమి చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు

- బుద్దారం పంచాయతీలో ఆక్రమణకు గురైన వైనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

గార్ల: మండలంలోని బుద్దారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 20గుంటల క్రీడామైదానం స్థలాన్ని కొంతమంది వారం క్రితం కబ్జా చేశారు. చుట్టూ ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఇంత జరిగినా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బుద్దారం గ్రామంలో గార్ల నుంచి డోర్నకల్ వెళ్లే రోడ్డు పక్కన 1561/1సర్వే నంబర్‌లోని లక్షలు విలువ చేసే 20గుంటల ప్రభుత్వ భూమిని క్రీడా స్థలం కోసం తహసీల్దార్ రాము కేటాయించారు. ఈ మేరకు ఎంపీడీఓ రవీందర్ స్థలాన్ని శుభ్రం చేయించి క్రీడామైదానం బోర్డు పెట్టించి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అయితే విలువైన భూమి కావడంతో అక్రమార్కుల కన్నుపడింది. వారం క్రితం ఓ వ్యక్తి క్రీడా మైదానం స్థలాన్ని ఆక్రమించుకొని బోర్డును తొలగించి పారేశాడు. ఇంతటితో ఆగకుండా ఆక్రమించుకున్న భూమి చుట్టూ ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాడు. కాగా ఇంత జరిగినా సంబంధిత అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్రీడామైదానం స్థలం కబ్జా విషయమై తహసీల్దార్ రామును సాక్షి వివరణ కోరగా.. బుద్దారం పంచాయతీలో 20 గుంటల ప్రభుత్వ భూమిని క్రీడామైదానం కోసం కేటాయించి ఎంపీడీఓకు అప్పగించామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌ను సైతం వివరణ కోరగా ప్రభుత్వ భూమిలో క్రీడామైదానం ప్రారంభించామని, వారం రోజుల క్రితం కొందరు వ్యక్తులు తమ భూమి అంటూ ఆక్రమించుకొని ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కబ్జా విషయంపై ఎంపీడీఓతో కలిసి కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ కమిలి తెలిపారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయికి 12మంది ఎంపిక

మహబూబాబాద్ అర్బన్: జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఉత్తమప్రతిభ చూపిన 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాస నాగమణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ ఎంపికలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాస నాగమణి మాట్లాడుతూ.. జిల్లాలో అండర్–20 చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించామని, ఇందులో 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వారు ఈనెల 15, 16తేదీల్లో హనుమకొండ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, పీఈటీలు రాణి, వీరన్న, అసోసియేషన్ సభ్యులు దాక్షి నాయక్, పార్వతి, కృష్ణ, నందిని పాల్గొన్నారు.

108 వాహనంలో సుఖ ప్రసవం



నెల్లికుదురు: పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి 108 వాహనంలో ప్రసవించిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. 108 వాహన సిబ్బంది మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఉమకు పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. గర్భిణిని నెల్లికుదురు పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి పాప మెడకు పేగు చుట్టుకుందని నిర్ధారించి అంబులెన్స్‌లో మానుకోట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఉమకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనం రోడ్డు పక్కన నిలిపి సిబ్బంది వైద్యుడి సలహాతో సుఖ ప్రసవం చేశారు. ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనివ్వగా.. ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారు. ఈమేరకు ఉమ బంధువులు అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓట్లు అడిగే హక్కు నాకే ఉంది



దంతాలపల్లి: 'దంతాలపల్లి మండల ఏర్పాటుకు కృషి చేసి అన్ని విధాలా అభివృద్ధి చేశా. సాగు, తాగునీరు, రోడ్లు వేయించా. ఈ మండలంలో ఓట్లు అడిగే హక్కు నాకే ఉంది' అని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 13న మండల కేంద్రంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. అనంతరం కుమ్మరికుంట్ల గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన వరుణ్‌సందేశ్ కుటుంబ సభ్యులను, గుండెపోటుతో చికిత్స పొంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన కుమ్మరికుంట్ల ఎంపీటీసీ సభ్యుడు దుబ్బాకుల వెంకన్నను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, ఎంపీపీ ఒలాద్రి ఉమా, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ మల్లారెడ్డి, సహకార సంఘం చైర్మన్ సంపెట రాము, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేష్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ వీరబోయిన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 02:30 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ రమాదేవి ఆదివారం తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చైర్‌పర్సన్, కలెక్టర్ హాజరవుతారన్నారు. జెడ్పీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

ప్రజలే బలగం.. బీఆర్ఎస్ కార్యకర్తలే నా బలం



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు



హాజరైన ప్రజలు

- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దా
- మంతి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర: ప్రజలే బలగం.. బీఆర్ఎస్ కార్యకర్తలే నా బలమని, ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాజరు కాగా ముఖ్య అతిథిగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్ లాంటి పార్టీ దేశంలో లేదని, 80లక్షల మంది బలగం బీఆర్ఎస్‌దని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. గ్రామాల్లో డంపింగ్‌యార్డులు, వైకుంఠ ధామాలు, పల్లెప్రకృతి వనాలు, హరిత హారం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళా సాధికారత కోసం 10వేల మందికి కుట్టు శిక్షణ ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానని, అందరూ కలిసికట్టుగా పార్టీని మరింత బలోపేతం చేసేందకు కృషి చేయాలన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు అదృష్టవంతులని, దయాకర్‌రావు రూపంలో మంచి మంత్రి దొరికాడన్నారు. దేశంలోనే అభివృద్ధిలో ఉత్తమ మంత్రిగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపీ సీఎం కేసీఆర్‌పై కక్షకట్టిందని ఆరోపించారు. సీఎం ఎవరికి భయపడకుండా అభివృద్ధి చేసి చూపుతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావులకు ప్రజలు కృతజ్ఞతగా ఉండి పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు, ఉషాదయాకర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు రామచంద్రయ్య శర్మ, జాటోతు నెహ్రూ నాయక్, యాదగిరిరావు, ముత్తినేని శ్రీనివాస్, పాకనాటి సోమారెడ్డి, శ్రీరాం సంజయ్, సుధీర్, ఉపేందర్‌రెడ్డి, విజయ్‌పాల్ రెడ్డి, రాజు, లింగమూర్తి, హరీశ్, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా, మండల అధికారులు, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో రాజకీయ జోక్యం దేశానికే ప్రమాదం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

మహబూబాబాద్ అర్బన్: విద్యా వ్యవస్థలో రాజకీయ జోక్యం దేశానికే ప్రమాదమని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సిలబస్ మార్పుపేరుతో ప్రజాస్వామిక అంశాలను తొలగించి ఫాసిస్టు విధానాలను జొప్పిస్తున్నారన్నారు. చరిత్ర పుస్తకాల్లో వాస్తవ సంఘటనలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. దేశభక్తి పేరుతో భావోద్వేగాలను పెంచి తమ అక్రమాలను కప్పిపుచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేపర్లు లీకేజీ చేసి విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడం సిగ్గుపడాల్సిన అంశం అన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత మాట్లాడుతూ.. విభిన్న భౌగోళిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు ఉన్న దేశంలో ఒకే విద్య ఎలా సాధ్యమన్నారు. ప్రజలు చైతన్యమైతే రాజకీయ నాయకుల ఆటలు సాగవని తెలుసుకాబట్టే మతాన్ని ముందుకు తెచ్చి చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. విద్యా వ్యాపారంతో పేదలకు చదువు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు చుంచు శ్రీశైలం, భాస్కర్, విష్ణువర్ధన్, కృష్ణమూర్తి, లోకేష్, మధు, సుదర్శన్, రమేష్, మహబూబ్‌అలీ, సైదుల్ పాష, ఉప్పలయ్య, భీముడు, లక్ష్మయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్ మేళా

నెహ్రూసెంటర్: బయ్యారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ జె.విజయ్ ఆదివారం తెలిపారు. బస్సుపాసుల కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్, అంగవైకల్యం కలిగిన ఫొటో, రూ.50 వెంట తీసుకురావాలన్నారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహించే బస్‌పాస్ మేళాను మండలంలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

డోర్ డెలివరీ!

- ఇంటింటికీ రాములోరి తలంబ్రాలు
- రూ.116 చెల్లించి ఆర్డర్ చేసిన వారికి..
- ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా భక్తులకు చేరవేత
- నేటితో బుకింగ్ గడువు ముగింపు

నెహ్రూసెంటర్: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవంలో ఉపయోగించే తలంబ్రాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ తలంబ్రాలను శుభకార్యాల్లో అక్షింతలుగా వాడితే రాముల వారి ఆశీస్సులు, అనుగ్రహం ఉంటుందని భక్తుల ప్రగాఢ నమ్మిక. దీనిలో భాగంగా జిల్లాలోని 472మంది భక్తులు రాములోరి తలంబ్రాల కోసం బుకింగ్స్ చేసుకోగా ఆర్టీసీ లాజిస్టిక్స్ కార్గో సిబ్బంది రాములోరి తలంబ్రాలను ఇంటింటికీ డోర్ డెలివరీ చేస్తున్నారు. కాగా నేటితో(సోమవారం) భక్తుల బుకింగ్ గడువు ముగుస్తుందని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు.

వెళ్లలేని భక్తుల కోసం..

భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో తలంబ్రాలను పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా రూ.116 చెల్లించి తలంబ్రాలను బుకింగ్ చేసి పేరు నమోదు చేసుకున్న భక్తులకు కార్గో సిబ్బంది స్వయంగా ఇంటికే తెచ్చి అందిస్తున్నారు. జిల్లాలో కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, కురవి, ఇనుగుర్తి, బయ్యారం, మరిపెడ ఇతర మండలాల నుంచి బుకింగ్స్ రాగా తలంబ్రాల పంపిణీని ప్రారంభించారు.

నేటితో ముగింపు..

భక్తులకు తలంబ్రాలను ఆర్డర్‌పై అందించేందుకు మార్చి 30వరకు అవకాశం ఉండగా.. వస్తున్న స్పందనను చూసి నేటి (ఏప్రిల్ 10వ తేదీ) వరకు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.



రాములోరి తలంబ్రాలు అందజేస్తున్న ఆర్టీసీ అధికారి

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



సీతారాముల కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తులు ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా రూ.116 చెల్లించి పేరు నమోదు చేసుకుని తలంబ్రాలు పొందవచ్చు. భక్తుల నుంచి వస్తున్న ఆదరణ మేరకు నేటి వరకు ఆర్డర్ చేసుకునేందుకు అవకాశం ఉంది.

-విజయ్, ఆర్టీసీ డీఎం, మహబూబాబాద్

భక్తులకు అందజేస్తున్నాం



ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఆర్డర్ చేసిన భక్తులకు తలంబ్రాలు అందిన వెంటనే ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు ఆర్డర్ చేసిన వారికి అందిస్తున్నాం. మరికొన్ని ఇవ్వాల్సి ఉంది. భక్తులు ఇంకా ఆర్డర్లు చేస్తున్నారు. వారికి అందజేస్తాం.

- వేలాద్రి, ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ డీఎంఈ

వసంతోత్సవానికి వీడ్కోలు

నిట్‌లో ముగిసిన 'స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని'

- సెలబ్రెటీ టాక్‌లతో అలరించిన డైరెక్టర్లు వేణు ఉడుగుల, తరుణ్‌భాస్కర్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో మూడు రోజులుగా విద్యార్థులు నిర్వహిస్తున్న వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. వివిధ కళాశాలల నుంచి వచ్చిన పదివేల మంది విద్యార్థులు 'బై బై స్ప్రింగ్ స్ప్రీ' అంటూ వీడ్కోలు పలికారు. 55 ఈవెంట్లు, ప్రోషోలు, ఆర్ట్, డీజే నైట్‌లతోపాటు గెస్ట్ లెక్చర్స్, సెలబ్రిటీ గెస్ట్‌లతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. డైరెక్టర్ కట్‌లో భాగంగా సినీ దర్శకులు వేణు ఉడుగుల, తరుణ్‌భాస్కర్ విద్యార్థులతో చిట్ చాట్ చేసి అలరించారు. హోప్ ఫర్ టుమారో పేరిట సైకాలజిస్ట్ విశేష్ ఆకట్టుకున్నారు.



చిట్‌చాట్‌లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులతో చిట్‌చాట్.. తరుణ్‌భాస్కర్ డైరెక్టర్



డైరెక్టర్ కాకపోతే ఏమయ్యేవారు?

నాకు కుకింగ్ అంటే చాలా ఇష్టం. నేను డైరెక్టర్ కాకపోతే మంచి చెఫ్‌ని అయ్యేవాడిని. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రంగంలోకి అడుగుపెట్టాలి. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీటెక్ చదువుతుండగా స్టడీపై ఆసక్తి లేదని నా మిత్రుడు కౌశిక్‌కు చెప్పగా స్టోరీలు రాయమన్నాడు. ఆవిధంగా షార్ట్‌ఫిల్మ్‌లతో మూవీస్‌లోకి వచ్చాను.

మీకిష్టమైన డైరెక్టర్, మీ రాబోయే సినిమాలు?

నాకు మణిరత్నం, సింగీతం శ్రీనివాస్ అంటే చాలా ఇష్టం. క్రైమ్ కామెడీతో నేను కీడాకోయిల పేరుతో ఓ సినిమా చేస్తున్నాను. 'పెళ్లి చూపులు', 'ఈ నగరానికి ఏమైంది' సినిమాల కంటే విభిన్నంగా ఉంటుంది. ఇందులో బ్రహ్మానందం ప్రత్యేకంగా కనిపించనున్నారు.

ఇటీవలి కాలంలో మీకు నచ్చిన సినిమా?

నాకు బలగం సినిమా బాగా నచ్చింది. మన సంస్కృతి సంప్రదాయాలను తెలంగాణ యాస కట్టిపడేసింది. కొత్త వారు చేసే సినిమాలను తప్పకుండా ఆదరించండి. నాకు నచ్చిన హీరో హీరోయిన్లు జూనియర్ ఎన్టీఆర్, మహేష్‌బాబు, సమంత.

సినీ రంగంలోకి ఎలా అడుగుపెట్టాలి?

సినీ రంగంలోకి రావాలంటే ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. ఇంటర్నెట్‌లో అన్ని అందుబాటులో ఉన్నాయి. ట్రెయినింగ్ పేరిట డబ్బులు ఖర్చు పెట్టకుండా గూగుల్, యూట్యూబ్‌లో నేర్చుకుంటే చాలు.



డైరెక్టర్ కట్ ..
వేణు ఉడుగుల, దర్శకుడు

- **మీకు జాబ్, డైరెక్షన్‌లో ఏది ఇష్టం?**
- నాకు జాబ్ అంటేనే ఎలర్జీ. డైరెక్టర్ అవ్వాలనద్దే చాలా ఇష్టం. ఇందుకోసమే విద్యనభ్యసించిన తర్వాత జాబ్‌కు వెళ్లలేదు. డైరెక్షన్ వైపు అడుగులు వేశాను.
- **సినిమా చాన్స్ ఎలా వచ్చింది?**
- సినిమా రంగంలో డైరెక్షన్ చేయాలనే తపనతో సినిమా రంగంలో అడుగుపెట్టాను. ఆర్జీవీ వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో మెళకువలు నేర్చుకున్నాను. డైరెక్షన్ చేస్తుండగా 'నీది నాది ఒకే కథ' సినిమా అవకాశాన్ని ప్రొడ్యూసర్ అందించారు.
- **విరాటపర్వం లాంటి కథకు స్ఫూర్తి ఎవరు?**
- ఓరుగల్లు జిల్లాలో పుట్టిన నేను నా చుట్టు పక్కన చోటు చేసుకున్న సంఘటనలకు జీవం పోయాలని.. ఓ సినిమాగా మలచాలనే ఆలోచనతోనే విరాటపర్వం సినిమా తీశాను.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

ములుగు రూరల్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలం లోని సర్వాపూర్ పంచాయతీ పరిధి లాలాయి గూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాయిగూడెంకు చెందిన సల్లూరి లచ్చయ్య (75) తన భార్యతో గొడవ పడి క్షణికావేశంలో ఆదివారం ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. లచ్చయ్య కుమారుడు వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

కుక్కలను చంపిన ఘటనపై విచారణ

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలో కుక్కలను చంపిన ఘటనపై వెటర్నరీ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ పరిధిలో కుక్కలను చంపారనే వీడియో యానిమల్ యాక్ట్‌కు చేరింది. దీంతో అక్కడి నుంచి జిల్లా వెటర్నరీ అధికారులకు పంపి విచారణ చేపట్టాలని సూచించారు. జిల్లా వెటర్నరీ జేడీ బాలకృష్ణ ఆదివారం ఖానాపురంలో విచారణ కుక్కలను ఎవరు చంపారనే వివరాలను సేకరించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి శ్రీలక్ష్మి, తదితరులు ఉన్నారు. కాగా, ఇదే అంశంపై ఇతర శాఖ అధికారులకు సైతం సమాచారం అందినట్లు తెలిసింది. క్షేత్ర స్థాయిలో ఇతర శాఖ అధికారులు సైతం విచారణ జరపనున్నట్లు తెలిసింది.

విరబూసిన బ్రహ్మకమలం



వరంగల్: నగరంలోని గోపాలస్వామిగుడి మట్టెవాడకు చెందిన గోరంటల మనోహర్ మాధవి ఇంటిఆవరణలో బ్రహ్మ కమలం పుష్పాలు విరబూసాయి. ఆరు నెలల కింద కార్తీక మాసం మొదటి సోమవారం ఒక పుష్పం .. మళ్లీ ఈరోజు రెండు పుష్పాలు పూయడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఏడాదికి ఒక పుష్పం పూయడమే ఎక్కువైతే సంవత్సరంలోనే మూడు పుష్పాలు పూయడంతో స్థానికులు పుష్పాన్ని సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీసుకున్నారు.

నెపియర్ గడ్డితో ఆదాయం

- ఏడాదిలో ఎకరాకు 200 టన్నుల దిగుబడి
- నెపియర్‌తో గ్యాస్, బొగ్గు, రంగుల ఉత్పత్తి



నెపియర్ గడ్డి

దుగ్గొండి: నెపియర్ గడ్డి.. గ్యాస్, బొగ్గు, రంగుల తయారీలో వినియోగించే ఈ గడ్డితో ఇప్పుడు జిల్లాలోని పలువురు రైతులు ఆదాయం గడించే పనిలోపడ్డారు. అన్నదాతల సమూహాలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేస్తుంది. సంఘాలు ఏర్పాటు చేసుకుని పరిశ్రమలు స్థాపించుకుంటే 50శాతం సబ్సిడీ ఇస్తుంది. చమురు ధరలు పెరగడం వల్ల జీవ ఇంధనాల అవసరం ఏర్పడింది. సీఎన్‌జీ, పీఎన్‌జీ ల అవసరం రోజు రోజుకూ పెరిగిపోతుంది. దీనిని అధిగమించడానికి గ్యాస్ ఉత్పత్తులకు మూలమైన నెపియర్ గడ్డి పెంపకం అన్నదాతలకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెట్టే అవకాశం ఉంది. దీంతో పాటు రసాయనిక వ్యవసాయానికి స్వస్తి చెప్పి సేంద్రియ సాగుకు బాటలు పడనున్నాయి.

నెపియర్ గడ్డి..

నెపియర్ గడ్డి నాటిన 5నెలలకు తొలికోత వస్తుంది. ఎకరాకు 100 టన్నుల దిగుబడి వస్తుంది. ఇలా ఏడాదిలో రెండు సార్లు 200 టన్నుల దిగుబడి వస్తుంది. దీనిని సాధారణంగా గ్రామాల్లో పాడిపశువులకు వినియోగిస్తున్నారు. అయితే నెపియర్ గడ్డి నుంచి బొగ్గు, మోటారు వాహనాలకు వినియోగించే సీఎన్‌జీ, ఇంటి అవసరాలకు వినియోగించే పీఎన్‌జీ, రంగుల తయారీతో పాటు ఆర్గానిక్ ఎరువులు తయారు చేసుకునే అవకాశం ఉంది. నెపియర్ గడ్డిని టన్నుకు రూ.1,000 చొప్పున కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థ రైతులనుంచి 30 సంవత్సరాలకు గాను అగ్రిమెంట్ చేసుకుంటుంది. విత్తనాలు, ఎరువులు వారే అందిస్తారు. వచ్చిన దిగుబడిని సైతం వారే పంట చేనువద్దనే కొనుగోలు చేసి వారే రవాణా చేసుకుంటారు. ఇందు కోసం మీరాక్లీన్ ఫ్యూయల్స్ లిమిటెడ్ సంస్థ త్వరలోనే రైతులకు అవగాహన కల్పించనుంది.

రైతులకు లాభదాయకం..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నెపియర్ గడ్డి పెంపకం నుంచి ఫ్యూయల్స్ తయారీతో రైతులకు లాభం ఉంటుంది. ఇతర పంటల మాదిరిగా ధరల హెచ్చుతగ్గుల వల్ల నష్టపోయే ప్రమాదం ఉండదు. ప్రభుత్వ నిర్దేశిత ధరకు అనుమతి పొందిన ఫ్యాక్టరీ కొనుగోలు చేస్తుంది. ఎకరాకు ఖర్చులు పోగా రూ. 1.50లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. నెపియర్ గడ్డి ఒకసారి వేస్తే 8 సంవత్సరాల పాటు ఏడాదికి రెండుసార్లు దిగుబడి ఇస్తుంది.

- సాంబశివరావు, మీరాక్లీన్ ఫ్యూయల్స్ ప్రతినిధి

నకిలీ పోలీస్ గ్యాంగ్ అరెస్ట్

- పోలీసులమని చెప్పి పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకుడికి బెదిరింపులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు శ్రీకాంత్, రమేష్

పాలకుర్తి టౌన్: పోలీసులమని చెప్పి.. పౌల్ట్రీఫామ్ నిర్వాహకుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన నకిలీ పోలీసుల గ్యాంగ్‌ను పోలీసుల అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాస్‌రావు వెల్లడించిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన పడమటింటి నవీన్, చుక్క యాకస్వామి, నామాల ఉదయ్, జిలుకర సోమేశ్వర్‌లు రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కష్టపడకుండా ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ పోలీసుల అవతారం ఎత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారానికి చెందిన పౌల్ట్రీఫామ్ నిర్వహించే ధరావత్ సాయికిరణ్‌కు కోళ్లకు దాణా నిమిత్తం రేషన్ బియ్యం అవసరం కాగా అతని అవసరాన్ని గుర్తించిన నలుగురు నిందితులు మార్చి 30న సాయికిరణ్‌కు ఫోన్ చేసి తమ వద్ద 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయని కొనేందుకు రావాలని సమాచారం అందించారు. సాయికిరణ్ రేషన్ బియ్యం కొనేందుకు లక్ష్మక్కపల్లికి వచ్చాడు. ప్రణాళిక ప్రకారం ఇద్దరు నిందితులు సాయికిరణ్ వెంట ఉండి రేషన్ బియ్యం అతనికి అప్పగించారు. సదరు బియ్యాన్ని వాహనంలో లోడ్ చేశారు. మరో ఇద్దరు ప్లాన్ ప్రకారం పోలీసులమని చెప్పి రేషన్ బియ్యం లోడ్ చేసిన వాహనాన్ని ఆపి కొడకండ్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లమని కేసు నమోదు చేస్తామని బెదిరించారు. బయపడిన సాయికిరణ్ తప్పనిసరి పరిస్థితుల్లో రూ.30 వేల నిందితుల నంబర్లకు ఫోన్ పే చేశాడు. రేషన్ బియ్యాన్ని సైతం తిరిగి నిందితులు తీసుకున్నారు. ఈ వ్యవహారంపై సాయికిరణ్ ఆరా తీయగా వారు పోలీసులు కారని తెలుసుకొని, మోసపోయానని గ్రహించి, కొడకండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల విచారణలో లక్ష్మక్కపల్లికి చెందిన నలుగురు పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకున్ని మోసం చేసినట్లుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి వారి నుంచి రూ.30వేలు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రావు పాలకుర్తి, దేవరుప్పుల, ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, రమేష్‌ను అభినందించారు. సమావేశంలో ఎస్సై యాకుబ్‌హుస్సేన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడి పేరుతో జరిమానాలు ?

- ట్రాఫిక్ పోలీసులపై సోషల్ మీడియాలో ప్రచారం



సోషల్ మీడియాలో వచ్చిన రశీదు

మహబూబాబాద్ రూరల్ : శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ పేరుతో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారని సోషల్ మీడియాలో ఆదివారం విస్తృత ప్రచారం జరిగింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు హల్‌చల్ చేస్తున్నారని, ఆగి ఉన్న వ్యక్తులను తీసుకొచ్చి డ్రంకెన్ డ్రైవ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుర్తుతెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. వినాయక నవరాత్రి ఉత్సవ రశీదులపై ఫైన్ రాస్తూ ప్రజలను దోపిడీ చేస్తున్నారని అందులో పేర్కొన్నారు. రశీదుపై మాత్రం డబ్బులు రాసినట్లుగా కనిపించలేదు. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం కాస్తా వైరల్ కావటంతో ఈ విషయమై ట్రాఫిక్ ఎస్సై భద్రునాయక్ ను వివరణ కోరగా తాము ఎలాంటి రశీదులు ఇచ్చి డబ్బులు అడగమని తెలిపారు. కేవలం మీ సేవా కేంద్రాల్లో మాత్రమే జరిమానాలు చెల్లించాలని వాహనదారులకు తెలియజేస్తామన్నారు. వారు అక్కడ చెల్లించి వచ్చి మీ సేవ రశీదు చూపిస్తే వాహనాన్ని పంపిస్తామని వివరణ ఇచ్చారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

కమలాపూర్: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని మాచనపల్లికి చెందిన డిగ్రీ విద్యార్థిని బండారి వైష్ణవి (19) ఆదివారం అదృశ్యమైనట్లు కమలాపూర్ ఎస్సై మోటం సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఈనెల 7న కళాశాలకు సెలవు ఉండటంతో కమలాపూర్ మండలం ఉప్పులపల్లిలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. చుట్టుపక్క ఇళ్లలో వెతికినా కన్పించలేదు. దీంతో విద్యార్థిని మేనమామ తన అక్కకు ఫోన్ కనుక్కోగా.. అక్కడకు కూడా రాలేదని తెలియడంతో.. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్యవైశ్యులకు సముచితస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

మరిపెడ/మరిపెడ రూరల్: ఆర్యవైశ్యులకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించడంతో పాటు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం ఇచ్చి పాలనలో భాగస్వాములను చేశాడని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ హాకా చైర్మన్‌గా మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన మచ్చా శ్రీనివాసరావు ఇటీవల బాధ్యతలు చేపట్టాడు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా మరిపెడకు వస్తున్న మచ్చా శ్రీనివాసరావుకు వంటికొమ్ము స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో బీఆర్‌ఎస్, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, మానుకోట ఎంపీ మాలోతు కవిత హాజరయ్యారు. ముందుగా హైదరాబాద్ నుంచి వచ్చిన హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావుకు మండలంలోని తానంచర్లలో ఆర్యవైశ్యులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి వందలాది బైక్‌లతో ర్యాలీగా మరిపెడకు చేరుకొని, కార్గిల్ సెంటర్ నుంచి వివిధ రకాల కళాకారులు నృత్యాలు, డప్పు చప్పుళ్లు, బాణా సంచా కాలుస్తూ గార్డెన్స్‌కు చేరుకున్నారు. అనంతరం డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. మచ్చా శ్రీనివాసరావు సర్పంచ్ నుంచి సేవా దృక్పథం కలిగి ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్యులకు సీఎం కేసీఆర్ ఉన్నతమైన పదవి కట్టబెట్టాన్నారు. మంత్రి సత్యవతి మాట్లాడుతూ.. బుర్హాన్‌పురం సర్పంచ్‌గా శ్రీనివాసరావు తన స్వగ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలిపాడని అన్నారు. ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హాకా చైర్మన్‌ను నియమించడం జరిగిందన్నారు. ఇప్పుడు మళ్లీ కేసీఆర్ ఈ పదవిని గుర్తించి ఆర్యవైశ్యుల నుంచి శ్రీనివాసరావుకు కట్టబెట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయడానికి ఆర్యవైశ్యులు అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్యుల భవన నిర్మాణానికి ఎకరం స్థలం ఇవ్వడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్, జెడ్పీ చైర్మన్ ఆంగోతు బిందు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిచంద్ర, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, చాపల యాదగిరిరెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు గుగులోతు సింధు, రామ్మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు నాళ్ల నర్సింహారావు, తల్లాడ వెంకటరామారావు, ఉప్పల నాగేశ్వర్‌రావు, గౌరి శంకర్, అరుణ, రాంబాబు, శారద, రవీందర్‌నాయక్, కొంపల్లి శ్రీధర్ రెడ్డి, రాంలాల్, కృష్ణ పాల్గొన్నారు.



హాకా చైర్మన్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, తదితరులు

ముగిసిన ఎస్సై రాత పరీక్షలు



పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థులకు సూచనలిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల పాటు జరిగిన సబ్ ఇన్‌స్పెక్టర్ల రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పోలీస్ ఉద్యోగాల నియామకాల్లో భాగంగా శని, ఆదివారాలు జరిగిన ఎస్సై రాత పరీక్షలు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 21 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పరీక్షకు 14,076 మందికి గాను 13,456 మంది హాజరు కాగా 620 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన నాల్గవ పేపర్‌కు 13,412 మంది అభ్యర్థులు హాజరుకాగా, 664 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అయన తెలిపారు. ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా హాల్‌లోకి అనుమతించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు రూట్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించారు. డివిజన్ స్థాయిలో ఏసీపీలు, డీసీపీ స్థాయి అధికారులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా పనిచేసిన డీసీపీలు మురళీధర్, కరుణాకర్, అబ్దుల్ బారీ, సీతారాం, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ట్రైనీ ఐపీఎస్ అంకిత్ కుమార్, రీజనల్ కో ఆర్డినేటర్ అనంద్ కిషోర్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బందిని సీపీ రంగనాథ్ అభినందించారు.

బారసాలకు దుస్తులు కొనేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో మామ అల్లుడు మృతి
- మానుకోట జిల్లా మరిపెడ మండలంలో ఘటన



బానోతు రమేష్ మృతదేహం

మరిపెడ రూరల్: తెల్లవారితే కుమారుడి బారసాల ఘనంగా చేద్దామనుకున్నాడు.. మామతో కలిసి నూతన వస్త్రాలు కొనేందుకు వెళ్లారు.. కానీ, రోడ్డు ప్రమాదంలో ఆ మామ అల్లుడు మృత్యువాతపడ్డారు. ఈ బాధాకరమైన ఘటన మానుకోట జిల్లా మరిపెడ మండల పరిధిలో బుర్హాన్‌పురం వద్ద ఆదివారం జరిగింది. మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం గ్రామానికి చెందిన మామ బానోతు రమేష్ (50), తన మనుమడి(బిడ్డ కొడుకు) బారసాల నిమిత్తం నూతన వస్త్రాలు కొనేందుకు అల్లుడు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కాంపాడు గ్రామానికి చెందిన ధరావత్ పవన్ (30)తో కలిసి మరిపెడ మండల కేంద్రానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో బుర్హాన్‌పురం గ్రామ శివారు బృహత్ పల్లె ప్రకృతి వనం వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన సూచిక బోర్డును ఢీకొట్టింది. ఈ సంఘటనలో మామ, అల్లుడు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు పవన్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తెల్లవారితే(నేడు) కుమారుడి బారసాలతో ఇల్లంతా బంధుమిత్రులతో పండుగ వాతావరణం చోటు చేసుకునే క్రమంలో మామ అల్లుడు చనిపోవడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నేడు మిర్చి కొనుగోళ్లు జరిగేనా..!

- బస్తాల బరువుపై లేఖ రాసిన చాంబర్ ఆఫ్ కామర్స్
- కొనుగోలు చేయమని మార్కెట్ కమిటీకి అల్టిమేటం



మార్కెట్ కార్యాలయంలో ఉన్న ఫ్లెక్సీలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో 25 కిలోల పైన 49 కిలోల లోపు ఉన్న మిర్చి బస్తాలను కొనుగోలు చేస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు మార్కెట్ కమిటీకి లేఖ రాయడంతో సోమవారం మిర్చి కొనుగోళ్లలో ప్రతిష్టంభన ఏర్పడే అవకాశాలున్నాయి. గత నెల 11న మంత్రి దయాకర్‌రావు అధ్యక్షతన కలెక్టర్లు, మార్కెట్ కమిటీ, మార్కెటింగ్‌శాఖ, చాంబర్ ప్రతినిధులు, వివిధ రైతు సంఘ నాయకులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారు లేఖలో పేర్కొన్నారు. మిర్చి బస్తాల బరువు విషయంలో మార్కెట్ కమిటీ రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమైందని చాంబర్ ప్రతినిధులు ఆరోపిస్తుంటే.. ఈవిషయంలో అడ్తిదారులు, ఖరీదుదారులకు కూడా బాధ్యత ఉందని మార్కెట్ కమిటీ పేర్కొంది. మిర్చి బస్తాలను తీసుకువచ్చే రైతులకు బరువుపై పూర్తిగా అవగాహన లేక పోవడం వల్ల సోమవారం జరిగే క్రయ, విక్రయాల్లో ఇబ్బందులు జరిగే అవకాశాలున్నాయి. గత వారం కూడా ఈ అంశంపై సుమారు గంటన్నర పాటు కొనుగోళ్లలో ప్రతిష్టంభన ఏర్పడిన విషయం తెలిసిందే. మార్కెట్ కమిటీ రైతులకు అవగాహన కల్పించేందుకు సుమారు రూ.3లక్షలు వెచ్చించి ప్రింటు చేయించిన ఫ్లెక్సీలు కార్యాలయంలో పక్కన పడవేయడం విశేషం.

వేపపుల్లకోసం వెళ్తే ప్రాణంపోయింది..



మైబు (ఫైల్)

చెన్నారావుపేట: వేపపుల్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల సూర్యపేట తండాలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన 3వ వార్డు సభ్యుడు ధారావత్ మైబు (42)కు ఎకరం పది గుంటల భూమి ఉంది. ఆదివారం మొక్కజొన్న పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. అనంతరం పళ్లపుల్ల(వేపపుల్ల) కోసం బావి దగ్గర ఉన్న వేప చెట్టు వద్దకు వెళ్లాడు. వేపపుల్ల తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డాడు. అప్పటికే నీళ్లు అయిపోవడంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. కాగా, ఉదయం చేను వద్దకు వెళ్లిన మైబు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెలక వద్దకు వెళ్లారు. బావి వద్ద చెప్పులు కనిపించడంతో బావిలోకి చూశారు. దీంతో జారి పడినట్లు గుర్తించారు. బయటికి తీసి చికిత్స కోసం నర్సంపేటలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మైబుకు భార్య సుజాత, కుమారుడు మధు, కూతురు హేమలత ఉన్నారు. కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

ప్రాణం తీసిన కోడి



పుల్లయ్య(ఫైల్)

కురవి: ఇంట్లో కోళ్లను కమ్మేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడిపోయి వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా ఆదివారం నేరడలో వెలుగు చూసింది. ఎస్సై రామునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా కురవి మండలంలోని నేరడ గ్రామానికి చెందిన కురాకుల పుల్లయ్య భార్య లలిత గత శుక్రవారం ఖమ్మంలో ఉంటున్న కుమార్తె స్వరూప వద్దకు వెళ్లింది. దీంతో శుక్రవారం రాత్రి కోళ్లను కమ్మేందుకు పుల్లయ్య ఇంట్లోకి వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. శనివారం పుల్లయ్య భార్య లలిత పక్కింట్లో ఉండే బాలుడు కల్యాణ్‌కు ఫోన్ చేసి తాత ఏం చేస్తున్నాడో చూడమని చెప్పింది. దీంతో కల్యాణ్ శనివారం సాయంత్రం ఇంట్లోకి వెళ్లి చూడగా కిందపడిపోయి ఉండడాన్ని గమనించాడు. ఎంత పిలిచినా పలక లేదు. దీంతో చుట్టు పక్కల వాళ్లకు విషయం వివరించడంతో వారు వచ్చి చూసేసరికి పుల్లయ్య మృతి చెంది ఉన్నాడు. వెంటనే విషయం లలితకు చెప్పారు. పుల్లయ్య కుమారుడు రామకృష్ణ ఆదివారం ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి, ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. శవ పంచనామా చేసి పోస్టుమార్టం కోసం మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు వెల్లడించారు.

పాముకాటుతో చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె)మండల పరిధిలోని వాగడూడెంలో ఓ చిన్నారి పాము కాటుతో మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడగూడెం గ్రామానికి చెందిన తేజశ్రీ (6) ఇంట్లో ఆడుకుంటుండగా పాము కాటుకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు పాపను ద్విచక్రవాహనంపై వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి డాక్టర్లు ఏటూరునాగారం వైద్యశాలకు రిఫర్ చేశారు. చిన్నారిని 108 వాహనంలో ఏటూరునాగారం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అయితే.. వెంకటాపురం సామాజిక ఆస్పత్రిలో బాలికకు వైద్యులు ఆలస్యంగా చికిత్స అందించడంతో పరిస్థితి విషమించిందని ఆరోపిస్తూ.. వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కుటుంబసభ్యులు చిన్నారి మృతదేహంతో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో రహదారిపై బైఠాయించి రెండు గంటల పాటు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సీఐ శివ ప్రసాద్ ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేదుకు కృషి చేస్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.